క్లుప్తంగా

సైక్లింగ్‌పై అవగాహన



సదస్సులో పాల్గొన్న వైద్యాధికారి రాజేష్ వర్మ తదితరులు

పూసపాటిరేగ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సైక్లింగ్‌పై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజేష్‌వర్మ మాట్లాడుతూ సైక్లింగ్ వలన శారీరక, మానసిక ధృడత్వం కలుగుతోందన్నారు. సైక్లింగ్‌తో సుగర్, బీపీ నియంత్రణలో ఉంటాయని, కేన్సర్, గుండె జబ్బులు రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వేదమణి, హెల్త్ ఎడ్యుకేటర్ రామలక్ష్మి, హెల్త్ సిబ్బంది ఆర్‌వీ రమణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ భాస్కరరావు

పూసపాటిరేగ: ఎన్నికలు కోడ్‌పై అప్రమత్తంగా వుండాలని తహసీల్దార్ ఇ.భాస్కరరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల విధి విధానాలపై మండల స్థాయి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్ నిర్వహణ, మోడల్ కోడ్, ఫ్లెయింగ్ స్క్వాడ్ విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రామారావు, ఎస్‌ఐ ఎ.నరేష్, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసురావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు డీఈఓ అభినందనలు



పీడీ సూర్యారావు సత్కరిస్తున్న డీఈఓ

విజయనగరం: జిల్లా వేదికగా రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను విజయవంతంగా నిర్వహించటంపై జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించటంలో కీలక పాత్ర పోషించిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యారావుతో పాటు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణలను సత్కరించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో ఇటువంటి పోటీలను దిగ్విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

అరసం కార్యదర్శిగా చలం



విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.ఎస్.చలం ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11,12 తేదీల్లో తెనాలిలో జరిగిన అరసం 80వ వార్షికోత్సవ 19వ రాష్ట్ర మహాసభల్లో నూతన కార్యవర్గం ఏర్పాటైందన్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, వల్లూరు శివప్రసాద్‌లు ఎంపికైనట్టు పేర్కొన్నారు. 80 ఏళ్ల కిందట తెనాలిలో తాపీ ధర్మారావు అధ్యక్షతన జరిగిన సభలు తిరిగి అదే పట్టణంలో జరగడం చారిత్రక విశేషమని పేర్కొన్నారు. ఆయనకు అరసం జిల్లా బాధ్యులు చాగంటి తులసి, ఆర్.బాలకృష్ణ, బద్రి కూర్మారావు, సభ్యులు అభినందనలు తెలిపారు.

మాదక ద్రవ్యాలతో జీవితాల చిత్తు



ఫ్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాలతో జీవితాలు ఛిద్రమవుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ తెలిపారు. విజయనగరం కార్పొరేషన్‌లోని ఎస్‌ఎస్‌పీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలకు వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వినియోగం వలన కలిగే నష్టాలను, అనారోగ్య సమస్యలను ఆర్థిక పరిస్థితులను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ వాడితే చట్టరీత్యా చర్యలు చేపడుతున్నారు. మాదక ద్రవ్యాలు మత్తు జీవితాన్ని ఏ విధంగా చిత్తు చేస్తుందో తెలిపారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వ్యతిరేకమైన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు, కానిస్టేబుల్ గంగాధరుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి చంద్రబాబు

- నాగవంశ సంక్షేమ సంఘం నాయకుడు అవనాపు విజయ్



సమావేశంలో మాట్లాడుతున్న అవనాపు విజయ్

విజయనగరం: టీడీపీ అధినేత చంద్రబాబు బీసీల ద్రోహి అని, వెనుకబడిన వర్గాలను అణగదొక్కుతున్న చంద్రబాబు సహా ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని నాగవంశ సంక్షేమ సంఘం నాయకులు అవనాపు విజయ్, గాడు అప్పారావు హెచ్చరించారు. ఇప్పటివరకు ఎటువంటి ఉన్నత పదవులను అలంకరించని నాగవంశీయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానం కల్పిస్తామని ప్రకటించి తాజాగా మాట తప్పి మోసం చేయటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భీమిలికి చెందిన గాడు చిన్నికుమారిని టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించడంతో నాగవంశ కులస్తులమంతా ఎంతో ఆనందించామని అన్నారు. ఎన్నికల సమీపించిన సమయంలో నాగ వంశ కులస్తులకు బదులుగా వేరే వాళ్లకు ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించి చంద్రబాబు బీసీ ద్రోహిగా మరోసారి నిరూపించుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిరెడ్డి బీసీ పక్షపాతి అని, బీసీల సంక్షేమం కోసం అనేక కార్పొరేషన్‌లను స్థాపించి చేసిన హామీలను నిలబెట్టుకున్నారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించేందుకు కట్టుబడి ఉంటామన్నారు. అంతేకాకుండా 2024లో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకునేందుకు నాగవంశస్తులంతా కృషి చేస్తామన్నారు. సమావేశంలో నాగవంశ కుల పెద్దలు బేరి సత్యనారాయణ, హంస శ్రీను, మద్దిల అప్పలనాయుడు, ఎన్నింటి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణ అత్యంత ఆవశ్యకమే

- నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



ఉచిత దంత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: శారీరక ఆరోగ్యానికి దంత సంరక్షణ అత్యంత ఆవశ్యకమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పేర్కొన్నారు. 11వ డివిజన్‌లోని కార్పొరేషన్ ఆవరణలో ఇండియన్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో డా.బాలాజీ మురపాల నేతృత్వంలో ఉచిత దంత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. డివిజన్ ప్రాంతంలో ఉన్న మహిళలకు, పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మేయర్ విజయలక్ష్మి ప్రారంభించారు. డా. బాలాజీ మురపాల ఆధ్వర్యంలో మహిళలకు, విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో దంత సంరక్షణ ఎంతో ముఖ్యమైందన్నారు. దంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటామని చెప్పారు. అయితే దంత సంరక్షణలో మహిళలు కొంత అశ్రద్ధ వహిస్తారని, పిల్లల్లో కూడా దంత సంరక్షణ సరిగా ఉండదని చెప్పారు. ఈ విషయంలో మహిళలు అత్యంత శ్రద్ధగా కనపరిచి, పిల్లల్లో దంతాల పరిరక్షణకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో ప్రయోజనాలు



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, రైతులు, మహిళలు

డెంకాడ: నవధాన్యాల సాగుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఏఈఓ రామకోటి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వనజ అన్నారు. నవధాన్యాల సాగు చేద్దాం నేల తల్లికి జీవం పోద్దాం అనే నినాదంతో మండలంలోని సింగవరం గ్రామంలో అవగాహన సదస్సు, ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంట సాగు చేయడానికి 45 రోజుల ముందు ఒక ఎకరాకు 13 కేజీల నవధాన్యాలు వేసి సాగు చేయడం వలన భూమి గుల్లఏర్పడి నేలకు మేలు జరుగుతుందన్నారు. పశువులకు పశుగ్రాసంగా వాడినట్లైతే పాల దిగుబడి పెరుగుతుందన్నారు. ఇలా అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ పి.గురుమూర్తి, రైతులు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దాతలు

విజయనగరం: సమాజ హితం కోసం వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎల్లప్పుడూ ముందుండటం శుభ పరిణామని ఆ పార్టీ జిల్లా యువజన విభాగం నాయకులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. పడాలపేట గ్రామంలో మంగళవారం జరిగిన సర్పంచ్ దివంగత సువ్వాడ అప్పయ్యమ్మ ప్రథమ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ముందుగా వెయ్యి మంది పేద మహిళలకు ముఖ్య అతిథి ఈశ్వర్ కౌశిక్ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే దివంగత సువ్వాడ అప్పయ్యమ్మ ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాన్ని ఎంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లారని అన్నారు. గ్రామంలో త్వరలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, ఇందుకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ దివంగత సర్పంచ్ సువ్వాడ అప్పయ్యమ్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దివంగత సర్పంచ్ అప్పయమ్మ కుటుంబ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ ఎస్‌వీవీ శశి భార్గవి, ఎంపీటీసీ నడిమింటి తులసి, వైస్ సర్పంచ్ గుడ్డాల నరేష్, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

త్రైత భగవద్గీత పరిచయం

డెంకాడ: మండలంలోని ముంగినాపల్లి, గుణుపూరుపేట, కొల్లాం గ్రామాల్లో త్రైత సిద్ధాంతం ఇందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత భగవద్గీత పరిచయ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. త్రైత భగవద్గీత సారాన్ని వివరించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు శంకరరావు, రాజేష్, ప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు

విజయనగరం పూల్‌బాగ్: నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ఉదయం 10గంటల నుండి 1గంట వరకు నీతి, నైతిక విలువలు పరీక్ష నిర్వహించనున్నట్టు ఆర్‌ఐఓ ఎం.సత్యనారాయణ తెలిపారు. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 24,675 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. 17న పర్యావరణ విద్య పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు 24614 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 20 నుంచి మార్చి 7వరకు రెండు సెషన్లలో ఉదయం 9గంటల నుండి 12గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 43086 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. జనరల్ విద్యార్థులకు ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు ఈ నెల 26 నుంచి మార్చి 7వరకు రెండు సెషన్లలో పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 43878 విద్యార్థులు హాజరవుతారన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు ఈ పరీక్షల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ట్రైనింగ్ సెంటర్‌ను తనిఖీ చేసిన పీడీ



విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

విజయనగరం టౌన్: డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో కెఎల్.పురంలో నిర్వహిస్తున్న లలిత గిరిజన మహిళా మండలి ట్రైనింగ్ సెంటర్‌ను డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి మంగళవారం తనిఖీ చేశారు. పథకం ద్వారా నిర్వహిస్తున్న హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో స్టీవార్డ్ శిక్షణ పొందుతున్న 60 మంది విద్యార్థులతో మమేకమై, వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం, హాస్టల్ వసతి గురించి అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం జిల్లా మేనేజర్ డి.మార్టిన్ లూథర్, ఎల్‌జీఎంఎం సిబ్బంది పాల్గొన్నారు.

సిరిమాను చెట్టు తరలింపు



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

గంట్యాడ: మండల కేంద్రంలోఎల్లమాంబ సిరిమానోత్సవానికి సంబంధించిన సిరిమాను చెట్టును గింజేరు గ్రామంలోని ఈడుకు రాంబాబు, తౌడు కళ్లం వద్ద గుర్తించారు. మంగళవారం ఆ చెట్టుకు పూజలు చేశారు. అనంతరం సిరిమాను చెట్టును నరికి గంట్యాడకు తరలించారు. సర్పంచ్ రాజన్న సూరిబాబు, ఉప సర్పంచ్ రాజన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు కుమార్‌స్వామి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో జైత్ర కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆల్తి శ్రీనివాసరావు, గ్రామ యువత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ కంటి వైద్యుడు డాక్టర్ మంచు కుమార్‌స్వామితో పాటు స్వామి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 270 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 83 మందిని ఉచిత కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. శిబిరంలో గ్రామ పెద్దలు వెంకట్రావు, రాయి విభీషణరావు, నడిపేన ఆనంద్, లక్ష్మణరావు, ఆదినారాయణ, ప్రకాశరావు, గోపాలమూర్తి పాల్గొన్నారు.

వేతనదారులు రెండు పూటలు పని చేయాలి



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో వేతనదారులు రెండు పూటలా పని చేయాలని ఎంపీడీఓ గిరిబాల సూచించారు. మండలంలోని చిన, పెద బూరాడపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె హాజరు పట్టీను తనిఖీ చేసి పలు సూచనలు అందించారు. ఉపాధి హామీ పనుల్లో వేతనదారులు సమయపాలన పాటించాలని పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. క్షేత్ర సహాయకులు జాబ్ కార్డులను పరిశీలించి కొలతలు సక్రమంగా కొలవాలన్నారు. అక్రమాలకు పాల్పడితే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ అరుణ పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు



మాట్లాడుతున్న డైట్ కళాశాల లెక్చరర్ ఈశ్వరరావు

డెంకాడ: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళికాబద్ధంగా చదవడంతో మంచి ఫలితాలు సాధించవచ్చని డైట్ కళాశాల లెక్చరర్ డి.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలోని గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడిని జయించి, లక్ష్యాలను ఎలా సాధించాలనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ఈశ్వరరావు మాట్లాడుతూ వాయిదాలు వేసే పద్ధతి మంచిది కాదన్నారు. పరీక్షలంటే అనవసరమైన భయాలకు పోకుండా ప్రశాంతంగా, ఒక పద్ధతి ప్రకారం ముందుకు సాగితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పవర్ ఎలక్ట్రానిక్స్, డ్రైవ్స్‌లో నూతన ఆవిష్కరణలు



ప్రొఫెసర్ రంజన్‌కుమార్ బెహరాను సత్కరిస్తున్న విభాగాధిపతి సుబ్బరామయ్య, అధ్యాపకులు

డెంకాడ: పవర్ ఎలక్ట్రానిక్స్, డ్రైవ్స్‌లో నూతన ఆవిష్కరణలు వస్తాయని, అందుకు ధీటుగా ఎలక్ట్రికల్ ఇంజినీర్లు తయారు కావాలని ఐఐటీ పాట్నా ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రంజన్‌కుమార్ బెహరా అన్నారు. జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యుత్ వాహనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రంజన్‌కుమార్ బెహరా మాట్లాడుతూ రాబోయే కాలంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌కు మంచి రోజులు ఉన్నాయని తెలిపారు. విద్యుత్ శక్తి ఆవశ్యకత, ఎలక్ట్రికల్ వెహికల్స్‌లో రాబోయే కాలంలో వచ్చే మార్పులు అందుకు అవసరమైన బ్యాటరీలు, ప్రత్యామ్నాయ విద్యుత్‌శక్తి వనరులపై ప్రసంగించారు. అనంతరం రంజన్‌కుమార్ బెహరాను సత్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి కె.సుబ్బరామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యశోధనరావు

విజయనగరం పూల్‌బాగ్: వసతిగృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం.యశోధనరావు అన్నారు. వసతిగృహ సంక్షేమాధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. వసతిగృహాలు పరిశుభ్రంగా ఉండేలా, విద్యార్థులు వేడినీళ్లు తాగేలా చూడాలన్నారు. వంద శాతం ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు కావాలన్నారు. వైద్య పరీక్షలు నిత్యం జరిగేలా చూడాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. సమావేశంలో సహాయ సంక్షేమాధికారి(అర్బన్) బివి.రమణ, వార్డెన్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ



కేన్సర్ నివారణ ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

భోగాపురం: కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పోలిపల్లి పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం ఆరోగ్య మెగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి మాట్లాడుతూ వ్యాయామంతోనే అనేక రోగాలను నివారించుకోవచ్చునని అన్నారు. వ్యాధులు వచ్చిన తరువాత వ్యాయామం, చికిత్స చేసుకునే కన్నా వ్యాధులు రాకముందే ప్రతి ఒక్కరూ వ్యాయామం చేస్తే వ్యాధులు రాకుండా అరికట్టవచ్చునని చెప్పారు. సైకిల్ తొక్కడం నిత్యం అలవాటుగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య శాఖ సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్‌ఎమ్‌లు పద్మావతి, కె.అరుణ, రమణ, ఎల్‌ఎంహెచ్‌పీలు దుర్గా మహాలక్ష్మి, గౌరీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో వేకువజామునుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు,కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఈఓ కిశోర్‌కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రులు 2,87,258

- ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల తుది జాబితా ప్రకటన
- ఓటర్లలో పురుషులే అధికం

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాను ప్రకటించారు. తుది ఓటర్ల నమోదు కార్యక్రమం సోమవారంతో ముగియగా.. మంగళవారం నాటికి మొత్తం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో 2,87,258 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లు జాబితా సవరణ ప్రక్రియ పూర్తి కావడంతో తుది ఓటర్ల జాబితా ప్రకటించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకు వచ్చేనెల 13న ఎన్నికలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం 2,87,258 మంది ఓటర్లలో పురుషులు 1,80,891, మహిళలు 1,06,329, ట్రాన్స్‌జెండర్లు(టీజీ) 38 మంది ఉన్నారు.

జిల్లాల వారీగా ఓటర్ల వివరాలివీ..

జిల్లా పేరు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
శ్రీకాకుళం	36,361	15,830	05	52,196
విజయనగరం	38,556	19,817	09	58,382
పార్వతీపురం మన్యం	12,399	5,959	02	18,360
అల్లూరి సీతారామరాజు	7,894	3,674	03	11,571
విశాఖపట్నం	58,105	47,117	13	1,05,235
అనకాపల్లి	27,576	13,932	06	41,514
మొత్తం	1,80,891	1,06,329	38	2,87,258

భీమసింగిలో నేత్రవైద్యశిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో శంకర్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ జె.వెంకటలక్ష్మి సహకారంతో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ శ్రీకాంత్, ఇతర వైద్య సిబ్బంది సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 15 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి త్వరలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నామని శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో-ఆర్డినేటర్ జోగారావు తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ మురళి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.